

నువ్వుంటే నా జతగా.. నేనుంటా ఊపిరిగా 8లో

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రేమను గెలిపించి.. పెళ్లి బంధంతో ఏకమైన కొందరి ప్రేమానుభూతులు వారి మాటల్లో..



పోచమ్మకు సదర్ బోనాలు

ముత్యాల పోచమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం శాంతి కల్యాణం నిర్వహించారు. మహిళలు సదర్‌బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.1 /15.3

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. గాలిలో తేమశాతం తగ్గుతుంది. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత పెరుగుతుంది. రాత్రి చలి ప్రభావం కూడా స్వల్పంగా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



కాలనీలో డ్రైనేజీ లను పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: రాబోయే వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. స్థానిక ఇసుర్రాళ్ల గుట్టవద్ద నిర్మిస్తున్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ పనులను సోమవారం పరిశీలించారు. వెంకటాద్రిపేటలోని వైకుంఠధామంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని, పార్కు ఏర్పాటు చేయాలని సూచించారు. 1, 2, 3, 5, 6 వార్డుల్లో పట్టణ ప్రకృతి వనాలు సరిగా లేవని అసహనం వ్యక్తం చేశారు. ప్లాన్ ప్రకారం మొక్కలు నాటి సంరక్షించాలని ఆదేశించారు. పట్టణంలో డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, కౌన్సిలర్లు, ఏఈలు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సురేశ్

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామ పంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేశ్ కోరారు. గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతీనెల 5వ తేదీలోపు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. సబ్బులు, యూనిఫామ్, బెల్లం, నూనె అందించాలన్నారు. కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు నరపక నర్సయ్య, రాజేందర్, మల్లేశ్, రాజేశ్, రాములు, నర్సయ్య, లక్ష్మణ్, గంగయ్య, రాజన్న, నవీన్, సాయన్న, బోరవ్వ, గంగవ్వ, అనిత తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న సగ్గం రాజు

సారంగపూర్: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు వచ్చాకే వివాహాలు జరిపించాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సగ్గం రాజు అన్నారు. మండలంలోని స్వర్ణ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు బాలల హక్కులపై సోమవారం అవగాహన కల్పించారు. బాల్యం చాలా అందమైనదని దానిని పిల్లలు సంపూర్ణంగా ఆస్వాదించడానికి తల్లిదండ్రులతోపాటు అందరూ సహకరించాలని సూచించారు. పిల్లల హక్కులకు ఎవరూ భంగం కలిగించొద్దని అన్నారు. బాల బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాల నియంత్రణకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రాంగణం అధికారి విజయలక్ష్మి, సీడీపీవో నాగమణి, నాగలక్ష్మి, సరిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయగౌరి, భాగ్య, సంధ్యారాణి పాల్గొన్నారు.

సామాన్యులకు అండగా నిలవాలి



అర్జీదారుల సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: సహాయం కోసం వచ్చే సామాన్యులకు పోలీసులు అండగా నిలవాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. బాధితుల సమస్యలు తెలుసుకొని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సామాన్యులకు అండగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసుల సహాయం కావాలనుకునేవారు ఠాణాలో నిర్భయంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, అసాంఘిక కార్యకలాపాలు జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

కోతలు షురూ.. కొనుగోళ్లు లేవు!

- ఇళ్లలో శెనగ పంట నిల్వ
- ప్రభుత్వ కేంద్రాలపై స్పష్టత లేదు
- మద్దతు ధర రూ.5,335
- ప్రైవేటు ధర రూ.4,200 నుంచి రూ.4,900



విక్రయించేందుకు పంట పొలంలో సంచుల్లో నిల్వ ఉంచిన శెనగలు



ఓ రైతు ఇంట్లో నిల్వ ఉంచిన శెనగ బస్తాలు

భైంసా: జిల్లాలో శెనగ రైతులు కొనుగోలు కేంద్రాల కోసం ఎదురుచూస్తున్నారు. 20 రోజులుగా జిల్లా సరిహద్దు మండలాలైన ముధోల్, తానూరు, కుభీర్, బాసర, కుంటాల, సారంగాపూర్ మండలాల్లో శెనగ పంట కోతలు ప్రారంభమయ్యాయి. పంట నూర్పిడి చేసి శెనగలను సంచుల్లో నింపారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో ఇళ్లలో నిల్వ చేస్తున్నారు.

దిగుబడి తగ్గింది...

జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 67 వేల ఎకరాల్లో శెనగ పంట సాగు చేశారు. 20 రోజుల నుంచి పంట చేతికి వస్తోంది. ఇప్పటికే 30 శాతం కోతలు పూర్తయ్యాయి. రైతులు దిగుబడిని ఇళ్లకు తరలించారు. ఇళ్లలో స్థలంలేని రైతులు పొలంలోనే కుప్పలుగా పోసి ఉంచారు. సాధారణంగా ఎకరాకు 8 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, ఈసారి పంటకు ఎండు తెగులు సోకడంతో దిగుబడి తగ్గిపోయింది. ప్రస్తుతం ఎకరాకు 3 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. దీంతో రైతులు పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదంటున్నారు.

ప్రైవేటు కొనుగోళ్ల ప్రారంభం...

తానూరు, ముధోల్, భైంసా, కుభీర్ తదితర ప్రాంతాల్లో ప్రైవేటు వ్యాపారులు శెనగ పంటను కొనుగోలు చేస్తున్నారు. నాణ్యత లేదంటూ క్వింటాల్‌కు రూ.4,200 నుంచి రూ.4,900 వరకు చెల్లిస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక ప్రైవేటు వ్యాపారులు చెప్పిన ధరకే పంట అమ్ముకుంటున్నారు రైతులు. మరోవైపు ప్రైవేటు వ్యాపారులు ప్రతీ సంచికి కిలో నుంచి రెండు కిలోల కోత విధిస్తున్నారు. ధర తగ్గించి, తరుగు పేరుతో రెండు కిలోల వరకు కోత విధిస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు.

మార్క్‌ఫెడ్ కేంద్రాలు ప్రారంభిస్తే..

ఏటా జిల్లాలో శెనగ పంటను మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేసేది. మార్క్‌ఫెడ్ అధికారులు జిల్లాలో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను తెరిచి టోకెన్లు జారీచేసి పంటను తీసుకుంటారు. ఈ కేంద్రాల్లో క్వింటాలు శెనగ ధర రూ.5,335గా నిర్ణయించారు. అంతా బాగానే ఉన్నా కొనుగోలు కేంద్రాలు మాత్రం ఇప్పటి వరకు ప్రారంభంకాలేదు. దీంతో రైతులు కొనుగోళ్ల కోసం నిరీక్షిస్తున్నారు.

కూలీలకు డబ్బులు ఇవ్వాలి...

ఎకరం విస్తీర్ణంలో శెనగ పంట కోసేందుకు రూ.3,200 నుంచి రూ.3,500 వరకు తీసుకుంటున్నారు. ఇక నూర్పిడి కోసం 50 కిలోల బస్తాకు రూ.110 నుంచి రూ.130 వరకు తీసుకుంటున్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్ నుంచి వచ్చిన వారు కుప్పగా ఉన్న శెనగ పంటను నూర్పిడిచేసి ఇస్తున్నారు. ఎకరం శెనగ పంట కోతకు, నూర్పిడికి రూ.6 నుంచి రూ.7 వేలు రైతులు ఖర్చు చేస్తున్నారు. పంట కోతలు, నూర్పిడి కోసం రైతులు అప్పులు చేస్తున్నారు. జిల్లా అధికార యంత్రాంగం స్పందించి కొనుగోలు కేంద్రాలను తెరిస్తే సకాలంలో శెనగ రైతులు పంటను అమ్ముకునే అవకాశం ఉంటుంది.

20 రోజులైంది



శెనగ పంట కోసి 20 రోజులైంది. సంచుల్లోనింపి ఇంట్లో నిల్వ చేసి ఉంచాను. కొనుగోలు కేంద్రాలు తెరిస్తే పంట అమ్ముకుంటాం. ఎప్పుడు కొంటారో తెలియడం లేదు. ఈ సీజన్‌లో చాలా మంది రైతుల పంట నిల్వలు ఇళ్లకు చేరాయి. – పాపేశ్‌పటేల్, రైతు

ఎప్పుడు కొంటరో..



శెనగ పంట ఇంటికి తెచ్చుకున్నాం. ఎప్పుడు కొంటరో తెలుస్తలేదు. ప్రైవేటులో వ్యాపారులు సరైన ధర ఇవ్వడంలేదు. క్వింటాల్‌కు ప్రైవేటులో రూ.4,200 నుంచి రూ.4,900 మాత్రమే ఇస్తున్నారు. త్వరగా కొనుగోలు కేంద్రాలు తెరవాలి. – ఈరన్న, రైతు

వారం రోజుల్లో కొనుగోళ్లు

వారం రోజుల్లో శెనగ పంట కొనుగోళ్లు ప్రారంభమవుతాయి. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.5,335 మద్దతు ధర నిర్ణయించింది. త్వరలోనే ఆన్‌లైన్‌లో ఉన్న వివరాల ప్రకారం జారీ చేసిన టోకెన్ల ఆధారంగా కొనుగోలు కేంద్రాల్లో శెనగలు తీసుకుంటాం. మండలాలవారీగా ఏర్పాటుచేసే కొనుగోలు కేంద్రాల వివరాలు త్వరలోనే వెల్లడిస్తాం.

– గౌరి నాగేశ్వర్‌రావు, మార్క్‌ఫెడ్ డీఎం, నిర్మల్

విద్యార్థులకు ప్రయోగాత్మకంగా

బోధించాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి
- విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ సందర్శన



మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్ రెడ్డి

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రయోగాత్మకంగా పాఠాలు బోధించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని వశిష్ఠ హైస్కూల్లో సైన్స్ ఉపాధ్యాయులకు మూడు రోజులుగా టెక్ మహీంద్రా సైన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ సోమవారం ముగిసింది. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులు ప్రయోగాల ద్వారా సమర్థవంతంగా బోధించటానికి ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తూ బోధించాలని తెలిపారు. అప్పుడే ఈ శిక్షణ ఉద్దేశం నెరవేరుతుందన్నారు. ఉపాధ్యాయులకు రూ.6 వేల విలువైన సైన్స్ కిట్లను పంపిణీ చేశారు. శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసిన టెక్ మహేంద్ర సైన్స్ అకాడమీ, సహాయత ట్రస్ట్ వారిని అభినందించారు. కార్యక్రమంలో సైన్స్ అకాడమీ ప్రాజెక్టు డైరెక్టర్ స్రవంతి, శిక్షకులు రేవతి, సత్యానంద్, బాకర్, ఆమీర్, డీఎస్‌వో వినోద్‌కుమార్, వశిష్ఠ పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్, సైన్స్ ఫోరం సభ్యులు కూర రమేశ్, నారాయణవర్మ, బచ్చు శ్రీనివాస్, రమాదేవి, అరవింద్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల్లో ధరల పట్టిక ఏర్పాటు చేయాలి

- కలెక్టర్‌కు వ్యవసాయ కార్మిక సంఘం వినతి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని ప్రతీ ఫర్టిలైజర్ షాపులో ధరల పట్టిక ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గైని మురళీమోహన్ కోరారు. అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్న షాపుల యజమానులపై చర్య తీసుకోవాలన్నారు. ఈమేరకు కలెక్టర్ వరుణ్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. యూరియా రూ.266కు అమ్మాల్సి ఉండగా రూ.300 కు విక్రయిస్తున్నారని తెలిపారు. డీఏపీ, 20:20పై బస్తాకు రూ.100 నుంచి రూ.200 అదనంగా వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. సమస్యను లోకేశ్వరం ఏవో దృష్టికి తీసుకెళ్తే రైతులకు లేని బాధ మీకెందుకని మాట్లాడుతున్నారని ఫిర్యాదు చేశారు. జిల్లా వ్యసాయాధికారి అంజిప్రసాద్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని తెలిపారు. డీఏవో, ఏవోపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి తిమ్మాపూర్ ముత్తన్న, తిమ్మాపూర్ దేవేందర్, నగరము మహిరాజ్, గడ్డం దేవన్న తదితరులు పాల్గొన్నారు.

ముషరఫ్ సేవలు అమోఘం



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా మాజీ కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖీ జిల్లా అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారని, ఆయన అందించిన సేవలు అమోఘమని రాష్ట్ర దేవాదాయ, న్యాయ, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్కే కన్వెన్షన్ హాల్‌లో ముషరఫ్ అలీ వీడ్కోలు సమావేశం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. మూడేళ్ల సేవలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. అంతకుముందు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి నూతన కలెక్టర్ వరుణ్‌రెడ్డి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, జెడ్పీ సీఈవో సుధీర్, రామేశ్వర్‌రెడ్డి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్వయంగా అర్జీలు స్వీకరించారు. అందులో 4 డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరు కోసం కాగా, మిగతా 12 భూ సమస్యలు, ఆసరా పింఛన్లు, తదితర శాఖలకు సంబంధించినవి ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిష్కారంకాని సమస్యలు ప్రజావాణిలో పరిష్కారం అవుతాయని ఎంతో నమ్మకంతో ప్రజావాణికి ప్రజలు వస్తుంటారన్నారు. ప్రజల అర్జీలను పరిశీలించి సమస్య పరిష్కరించేందుకు అధికారులు అంకితభావంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోడు పట్టాలు భిక్ష కాదు హక్కు



కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: పోడు భూముల పట్టాలు ముఖ్యమంత్రి కేసీఆర్ భిక్ష కాదని, ఆదివాసీల హక్కని ప్రజాసమస్యలు ఏఐపీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి నంది రామయ్య అన్నారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులు, గిరిజనేతరులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా పట్టాలు ఇవ్వాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా(ఏఐపీకేఎస్) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోడు సమస్య పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇస్తున్నామని చెబుతూ ఉన్న భూములు లాక్కుంటోందని తెలిపారు. అటవీ హక్కుల చట్టాన్ని నీరుగార్చేలా అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రసంగం ఉందన్నారు. అడవిపై పూర్తి హక్కులు ఉన్న ఆదివాసీలను అవమానించేలా ప్రజాప్రతినిధుల సంతకాలు ఉండాలనడం సరికాదన్నారు. పోడు రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐఎంఎల్ ప్రజా పంథా జిల్లా కార్యదర్శి కె.రాజన్న మాట్లాడుతూ 2006 అటవీ హక్కు చట్టం ప్రకారం పట్టాలు ఇవ్వాలని, సాటిలైట్ సర్వే రద్దు చేసి భౌతికంగా సర్వే చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చారు. ఆందోళనలో జిల్లా కార్యదర్శి కట్ల లక్ష్మి, ఐఎఫ్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు బక్కన్న, రామ లక్ష్మణ్, నాయకులు గంగన్న, ఎస్.లక్ష్మి, ఎస్‌డీ.మహిమూద్, ఎండీ.గఫూర్, అంకూస్‌రావు పటేల్, జక్కుల రాజన్న, సుదర్శన్, ఎల్లన్న, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'కు అనుమతివ్వాలి

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అనుబంధ శాఖ సీఐటీయూ పిలుపు మేరకు హైదరాబాదులో మంగళవారం నిర్వహించే ధర్నాలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని డీడబ్ల్యూవోకు అంగన్‌వాడీలు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజమణి, సుజాత మాట్లాడుతూ హైదరాబాదులో నిర్వహించే సభకు ప్రతి ఒక్కరూ హాజరవుతున్నారని తెలిపారు. ముందస్తు సమాచారం కోసమే డీడబ్ల్యూవోకు వినతిపత్రం ఇచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సరోజ, భాగ్యలక్ష్మి, రాజమణి, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి తర్వాతే.. ప్రేమ

- టీనేజీలో ఉండేది ఆకర్షణే
- వివాహం అయ్యాకే ప్రేమించాలంటున్న యువత
- అప్పుడే ఎలాంటి ఇబ్బందులుండవు
- 'సాక్షి టాక్'లో ఛాత్రోపాధ్యాయుల అభిప్రాయం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్/కైలాస్‌నగర్: ప్రేమ.. రెండక్షరాల ఈ పదం కొందరికి ఆనందాన్ని, మరికొందరికి విషాదాన్ని మిగులుస్తోంది. ఏమీ తెలియని వయసులో ఆకర్షణే ప్రేమ అనుకొని జీవితాల్లో తడబడిన వారు కొందరైతే.. వైవాహిక బంధంతో ఏకమై తమ జీవితాలను నిలబెట్టుకున్న వారూ ఉన్నారు. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో 'పెళ్లికి ముందు ప్రేమ.. పెళ్లి తర్వాత ప్రేమ..' అనే అంశంపై 'సాక్షి' ఆధ్వర్యంలో సోమవారం 'టాక్‌షో' నిర్వహించింది. ఇందులో మెజారిటీ ఛాత్రోపాధ్యాయులు పెళ్లి తర్వాతి ప్రేమనే మధురమని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను అనుసరిస్తూ నేటి యువత ముందుకు సాగాలన్నారు. సమానత్వ భావనతో పరస్పరం గౌరవించుకోవాలని సూచించారు. సినిమాల్లో చూపినట్లు ప్రేమ ఉండదని, నిత్య జీవితంలో తప్పుదోవ పట్టకూడదన్నారు. ప్రేమ పేరుతో నేటి సమాజంలో దారుణాలు చోటు చేసుకుంటున్నాయని, ఈక్రమంలో తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జీవితంలో స్థిరపడ్డాకే పెళ్లి చేసుకొని ఆనందంగా గడపాలన్నారు.

టీనేజీలో ఉండేది ఆకర్షణే



టీనేజీ వయసులో ఏ విషయానికైనా ఇట్టే ఆకర్షితులవుతారు. ఆ సమయంలో ఆలోచనతో కాకుండా ఉద్వేగపూరితంగా వ్యవహరిస్తారు. ఈ కారణంగానే కలిగే ప్రతి ఫీలింగ్‌ను ప్రేమగా భ్రమ పడుతారు. ఈ సందర్భంలో మనం తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్తును నిర్ణయిస్తాయి. – ఎస్. మనీషా, వైష్ణవి

తెలియని వయసులో ప్రేమ సరికాదు



అర్థం కూడా తెలియని వయసులో ప్రేమించి ఎంతో మంది అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. వారు తీసుకునే అనాలోచిత నిర్ణయాలతో కుటుంబాలకు దూరం అవుతున్నారు. అందుకే పెళ్లి తర్వాతే తమ ప్రేమను జీవిత భాగస్వామికి చూపించాలి. అప్పుడు కుటుంబ సభ్యులతో పాటు జీవిత భాగస్వామికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుంది. జీవితం సాఫీగా సాగుతుంది. – టి.ప్రవళిక, ఆర్. సౌజన్య

పెళ్లి తర్వాత ప్రేమే స్వచ్ఛమైనది



నా దృష్టిలో పెళ్లి తర్వాతి ప్రేమే స్వచ్ఛమైనది. మన పెద్దలు వెనుకా ముందు ఆలోచించి పెళ్లిళ్లు చేస్తారు. వారి అనుభవంతో కూడిన నిర్ణయాలు భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉంటాయి. పెళ్లికి ముందు మనం తీసుకున్న నిర్ణయాల్లో పొరపాట్లు ఉండే అవకాశం ఉంది. వైవాహిక జీవితంలో ఒక్కటైన తర్వాత ఒకరినొకరు అర్థం చేసుకొని ముందుకు సాగడం వల్ల ప్రేమ స్వచ్ఛంగా ఉంటుంది. జీవితం ఆనందంగా గడుపుతారు.

– ఎస్. సాయి దివ్యేశ్వరి, బి. లావణ్య

తల్లిదండ్రులను మర్చిపోవద్దు...



ప్రేమ అనే భావన గొప్పదే అయినా.. నేటి కాలంలో దాని అర్థాన్ని మార్చేస్తున్నారు. ప్రేమ అంటే ఓ అబ్బాయి అమ్మాయిని ప్రేమించడం.. అమ్మాయి అబ్బాయిని ప్రేమించడం కాదు. మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు, గురువులను మనస్ఫూర్తిగా గౌరవిస్తూ ప్రేమించడం కూడా మర్చిపోకూడదు. ప్రేమ పేరుతో కుటుంబాలకు దూరమై.. మనల్ని అపురూపంగా పెంచిన వాళ్లని విస్మరించడం సమంజసం కాదు. కుటుంబాన్ని నిజంగా ప్రేమించిన వారే ఇతరులను కూడా గౌరవిస్తారు. – రాహుల్

నిజాయతీగా బంధాన్ని నిలబెట్టుకోవాలి



పెళ్లికి ముందు ప్రేమించడంలో ఎటువంటి తప్పు లేదు. అయితే నిజాయతీగా ఆ బంధాన్ని నిలబెట్టుకున్నప్పుడే ఆ ప్రేమకు విలువ ఉంటుంది. ప్రేమించిన వ్యక్తిని అన్ని సమయాల్లో నమ్ముతూ, గౌరవిస్తూ జీవితంలో స్థిరపడి ఆ విషయాన్ని తల్లిదండ్రులకు విన్నవించుకుంటే వారు సైతం ప్రేమకు అడ్డు చెప్పరు. తల్లిదండ్రులు, కుటుంబాల అభిప్రాయాలను సైతం పరిగణలోనికి తీసుకోవాలి. అప్పుడే ప్రేమకు నిజమైన సార్థకత ఉంటుంది. – మనోజ్

లక్ష్యాన్ని ప్రేమించాలి



జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలు, గమ్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలి. వాటిని ప్రేమిస్తూ ముందుకు సాగాలి. మన కాళ్లపై మనం నిలబడిన తర్వాత ఏ నిర్ణయం తీసుకున్నా భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. అంతేగానీ ప్రేమ, పెళ్లి అంటూ అలో చిస్తే మనం ఎంచుకున్న ఆశయాన్ని చేరుకోలేం. ఈ దిశగా యువత ఆలోచించాలి. – కే.రోజా

ఆర్థిక స్థిరత్వం ఉంటేనే..



ఈ రోజుల్లో ఆర్థికంగా స్థిరపడి ఉంటేనే ఇష్టపడుతున్నారు. కానీ పెళ్లయిన తర్వాత వారి అలవాట్లు నచ్చకుండా తమ బంధాలను కొనసాగించలేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్నప్పటికీ అనుకోని సంఘటనలు జరిగినప్పుడు అవస్థలు పడుతున్నారు. – ఆర్. రాణి

పెళ్లి తర్వాతే ప్రేమానుబంధాలు..



పెళ్లికి ముందు ప్రేమ ఒక కాలక్షేపమే.. ఎంతో మంది యువత దీని వల్ల తమ భవిష్యత్‌ను కోల్పోవడమే కాకుండా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. పెద్దలు నిశ్చయించిన పెళ్లితో ఎటువంటి అనర్థాలు ఉండవు. అందరి సమక్షంలో వివాహం జరగడం వల్ల ఒకరినొకరు అర్థం చేసుకొని ముందుకు సాగుతారు. పెళ్లి తర్వాతే అనుబంధాలు, అప్యాయత అనురాగాలు ఉంటాయి. పెళ్లి తర్వాతి ప్రేమ కలకాలం నిలుస్తుంది.

– సీహెచ్. రక్షిత,

క్లుప్తంగా

మద్యం మత్తులో జారిపడి మృతి


నవీన్‌కుమార్ (ఫైల్)

కుంటాల: మండల కేంద్రానికి చెందిన ఆటోడ్రైవర్ ఆయిట్ల నవీన్‌కుమార్ మద్యం మత్తులో ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందాడు. ఏఎస్సై దేవరావు కథనం ప్రకారం..నవీన్‌కుమార్ (30) మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి అతిగా మద్యం తాగి ఇంటి ముందు జారిపడగా తలకు తీవ్రగాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న పందెన నవీన్ గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాత్రి చికిత్సపొందుతూ మృతి చెందాడని ఏఎస్సై పేర్కొన్నారు. మృతుడి సోదరుడు సాయికుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. నవీన్‌కుమార్ మృతితో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటోలను బంద్‌చేసి సంతాపం ప్రకటించారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి

బోథ్: మండలంలోని పిప్పల్‌ధరి గ్రామ శివారులో మోటారు వైర్ తాకి ఎద్దు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. బాధిత రైతు ఆకుల శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పంటచేనులో మేత మేస్తుండగా కెనాల్ నుంచి చేనులోకి నీరు ఇచ్చే ఆయిల్ ఇంజన్ వైరును ఎద్దు తాకడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.50 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాజు

కడెం(ఖానాపూర్): మండలంలోని ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన గడ్డం తులసయ్య (58) మద్యం మత్తులో మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. తులసయ్య భార్య ఇటీవలే మృతి చెందడంతో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం పంట చేనుకు వెళ్లిన తులసయ్య సాయంత్రం ఇంటికి వచ్చే క్రమంలో అదుపు తప్పి కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం సీఐ అజయ్‌బాబు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఆరుగురు డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వవిద్యాలయం డిగ్రీ ప్రథమ సంవత్సరం పరీక్షలు ఈనెల 9 నుంచి కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం జరిగిన పరీక్షలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరుగురు విద్యార్థులు డిబార్ అయ్యారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, నలందా డిగ్రీ కళాశాలలో ముగ్గురు, మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు డిబార్ అయ్యారు.

ప్రాజెక్ట్‌లో పడి వృద్ధురాలి మృతి


మధునవ్వ (ఫైల్)

కడెం(ఖానాపూర్): కడెం ప్రాజెక్టులో పడి వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. మండలంలోని కన్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నక్యాంప్ గ్రామానికి చెందిన కాశిపాక మధునవ్వ (65) నాలుగు రోజుల క్రితం అదృశ్యమైంది. ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతుకుతుండగా పెద్దూర్ సమీపంలో కడెం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నువ్వుంటే నా జతగా.. నేనుంటా ఊపిరిగా

ప్రేమ.. అనిర్వచనీయమైన అనుభూతి, ప్రేమ.. వెలకట్టలేని సంపద. నిస్వార్థమైన, నిజాయతీతో కూడిన ప్రేమ ఎంతో పవిత్రమైనది..శక్తివంతమైనది. ఈ ప్రపంచాన్నే ముందుకు నడిపించే భావోద్వేగమే ప్రేమ. ఏ బంధమైన వికసించాలన్నా..చిరకాలం నిలవాలన్నా ప్రేమ ఒక్కటే మార్గం. అది ఇద్దరు వ్యక్తుల మధ్య అయి ఉండవచ్చు.. లేదా కుటుంబం, సమాజం మీద అయి ఉండవచ్చు. నిజమైన ప్రేమ ధనంతో.. బలంతోనే దక్కించుకునేది కాదు. నిజమైన ప్రేమను నిజంగా ప్రేమించడం ద్వారానే జయించగలం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చాలా మంది తమ నిజమైన ప్రేమతో జీవితాన్ని ఆనందమయం చేసుకున్నారు. ప్రేమను గెలిపించి.. పెళ్లి బంధంతో ఏకమై ప్రేమానుభూతులను ఆస్వాదిస్తున్నారు. నువ్వుంటే నా జతగా... నేనుంటా నీ ఊపిరిగా అంటూ దేహాలు వేరైనా మన ప్రేమ ఒక్కటే అంటూ ముందుకు సాగుతున్నారు. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో కొంతమంది ప్రేమానుభూతులు వారి మాటల్లో..



valentines day special

చదువు అండగా నిలిచింది



నిర్మల్‌చైన్‌గేట్: ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సీ చదువుతున్న సమయంలో ఆదిలాబాద్‌కు చెందిన కేంద్రీ సోనీతాయ్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. పీజీ పూర్తి చేసిన రెండేళ్ల తర్వాత ఇద్దరం హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో ఉద్యోగంలో చేరాం. ఇద్దరి కులం ఒక్కటైనా భాష వేరుకావడంతో పెళ్లికి పెద్దలు నిరాకరించారు. సెప్టెంబర్ 26, 2015న నిర్మల్ జిల్లా కేంద్రంలోని గండి రామన్న ఆలయంలో వివాహం చేసుకున్నాం. మేము చదివిన చదువు మాకు అండగా నిలిచింది. ప్రస్తుతం ఇద్దరం నిర్మల్‌లోనే లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నాం. 2018లో పాప జన్మించింది. ఆ తర్వాత మా కుటుంబ సభ్యులు మా ప్రేమను అర్థం చేసుకొని మాతో కలిసిపోయారు.

– బలాస్ట్ శివరామకృష్ణ, కేంద్రీ సోనీతాయ్

ఆర్థికంగా కష్టాలు ఎదుర్కొని..



తాంసి: తాంసి మండల కేంద్రానికి చెందిన రేండ్ల అజయ్, ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన అనూష హైదరాబాద్‌లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న సమయంలో వారి మధ్య ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. 2010లో వివాహం చేసుకున్నారు. ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటూనే చదువును పూర్తి చేశారు. అజయ్ ఎంబీఏ పూర్తి చేసి ఫార్మా కంపనీలో మార్కెటింగ్ ఉద్యోగంలో చేరాడు. రెండేళ్ల క్రితం అల్‌మైటి ఫార్మా కంపనీ ప్రారంభించాడు. అనూషను సైతం జీఎన్ఎం శిక్షణ పూర్తి చేయించడంతో హైదరాబాద్‌లోని మెడికవర్ హాస్పిటల్‌లో సీనియర్ నర్స్‌గా విధులు నిర్వర్తిస్తోంది. దీంతో ఆర్థిక కష్టాలు దూరమయ్యాయి. సమాజసేవలో సైతం ముందుండి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

– రేండ్ల అజయ్, అనూష

అలు పెరగని ప్రేమ



జన్నారం: మండలంలోని పొనకల్‌కు చెందిన మూల భాస్కర్‌గౌడ్, రేణుక ఇంటర్‌లోనే ప్రేమించుకున్నారు. ఇద్దరి కులాలు ఒక్కటే అయినా వయస్సు రీత్యా మైనర్లు కావడంతో ఐదేళ్లపాటు ఆగి ఆతర్వాత పెద్దలను ఒప్పించి 1980 ఫిబ్రవరి 14న వివాహం చేసుకున్నారు. దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. ప్రేమించడమే కాకుండా పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నప్పుడే ఆ ప్రేమ చిరకాలం నిలుస్తుందని, తల్లిదండ్రులను బాధపెట్టవద్దన్నది మా ఉద్దేశమని వారు పేర్కొంటున్నారు.

– భాస్కర్‌గౌడ్, రేణుక

పెద్దలను ఒప్పించి..



చెన్నూర్‌రూరల్: పట్టణంలోని మంగళి బజార్‌లో నివాసం ఉంటున్న కారెంగుల శ్రావణ్ పటేల్, మానసరాణి దంపతులది ప్రేమ వివాహం. 2011లో మానస కాలేజీకి వెళ్తుండగా చూసిన శ్రావణ్ ఆమెతో ప్రేమలో పడ్డాడు. సుమారు ఐదేళ్లపాటూ ప్రేమించుకున్నారు. ఇద్దరూ ఒకే కులానికి చెందినవారు కావడంతో యువతి ఇంటికి వెళ్లి పెద్దలతో మాట్లాడాడు. పెళ్లికి ఒప్పుకోవడంతో 2016లో వివాహం చేసుకున్నారు. వీరి ప్రేమకు గుర్తుగా ఇద్దరు కుమారులు జన్మించారు. శావణ్ సోదరుడు సందీప్‌ది కూడా ప్రేమ వివాహమే. విజయ అనే యువతిని ప్రేమించి నాలుగేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు.

– కారెంగుల శ్రావణ్, మానస రాణి

నమ్మకమైన బంధానికి ప్రతిరూపం



గుడిహత్నూర్: నమ్మకమైన బంధానికి ప్రతి రూపమే ప్రేమ అని.. ఇది లేకుండా మనిషి సంఘ జీవుడు కాలేడని చెప్తున్నారు ఉపారపు సత్యరాజ్–పార్వతి దంపతులు. మండలంలోని లింగాపూర్‌కు చెందిన సత్యరాజ్ 2017లో హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా అక్కడే పనిచేస్తున్న ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని గోయగాంకు చెందిన పార్వతితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. కులాలు వేరుకావడంతో ఇరువురి పెద్దలు పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో గతేడాది జనవరి 25న రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. ఎంతో అన్యోన్యంగా జీవిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

– సత్యరాజ్, పార్వతి

ప్రేమలో గెలిచి..



బోథ్: మండల కేంద్రానికి చెందిన కట్ట పల్లవి, భూమేశ్ దంపతులది ప్రేమ వివాహం. ఒకే కాలనీలో ఉంటున్న ఇద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దాదాపు నాలుగేళ్ల పాటు ప్రేమించుకున్నారు. ఇరువురి కులాలు వేరు కావడంతో పెళ్లికి పెద్దలు ఒప్పుకోలేదు. దీంతో 2011లో తలమడుగు మండలం కజ్జర్ల శివారులోని శివాలయంలో స్నేహితుల మధ్య వివాహం చేసుకున్నారు. వివాహమైన వారం రోజులకే ఇరువురి కుటుంబసభ్యులు కలిసిపోయారు. అప్పటినుంచి వారి దాంపత్యం అన్యోన్యంగా సాగుతోంది. ఏడాదూ వారి మధ్య భేదాభిప్రాయాలు రాలేదని దంపతులు పేర్కొంటున్నారు.

– కట్ట పల్లవి, భూమేశ్

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం


స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనే పోలీస్‌లను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ కాంతిలాల్

నిర్మల్‌టౌన్: క్రీడలు మానసిక ఒత్తిడిని దూరం చేస్తాయని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నాలుగు రోజులు నిర్వహించే జిల్లా పోలీసుల స్పోర్ట్స్ మీట్ – 2023ని సోమవారం ప్రారంభించారు. ఇందులో జిల్లాలోని సుమారు 150 మంది పోలీసులు పాల్గొన్నారు. వీరికి క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మొదటగా క్రికెట్‌లో నిర్మల్ హెడ్ క్వర్టర్స్, భైంసా సబ్ డివిజన్ జట్లు పోటీపడ్డాయి. నిర్మల్ హెడ్‌క్వార్టర్స్ జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ... ప్రతీరోజు ఉద్యోగులు తీవ్ర ఒత్తిడితో విధులు నిర్వహిస్తారని, క్రీడల్లో పాల్గొంటే ఉపశమనం, ఉల్లాసం కలుగుతుందన్నారు. జిల్లాలో పనిచేసే ఉద్యోగులు ఒక్కచోట కలుసుకునే అవకాశం లభించిందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, పట్టణ సీఐ మల్లేశ్, జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఐటీడీఏ ముట్టడి విజయవంతం చేయాలి'

నిర్మల్‌చైన్‌గేట్: వాల్మీకి బోయ, ఖాయితీ లంబాడాలతో పాటు మరో 11 కులాలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ శుక్రవారం సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న తలపెట్టిన ఐటీడీఏ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకగారి భూమయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న 9 తెగల అభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం ఏం చేయకపోగా మరో 11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చి తొమ్మిదేళ్లు కావస్తున్నా ఇప్పటికీ ఆదివాసీలకు సరైన విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలులేక అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. తొమ్మిది తెగల ఆదివాసీ ప్రజలు, ఉద్యోగులు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు అధికసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పలు రైళ్లు రద్దు

మంచిర్యాలక్రైం: మంచిర్యాల మీదుగా నడుస్తున్న పలు రైళ్లను ఈ నెల 15 నుంచి 24 వరకు రద్దు చేసినట్లు స్థానిక రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సికింద్రాబాద్ డివిజన్‌లోని కాజీపేట–బల్లార్ష సెక్షన్‌లోని వీరూర్, మాకుడి రైల్వే స్టేషన్ల మధ్య మూడో రైల్వేలైన్ నాన్ ఇంటర్ లాకింగ్ నిర్మాణం పనులు కొనసాగుతుండడంతో రద్దు చేసినట్లు తెలిపారు. కాజీపేట–బల్లార్ష, బల్లార్ష–కాజీపేట, సికింద్రాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్, సిర్పూర్‌కాగజ్‌నగర్–సింద్రాబాద్, హెచ్ఎస్ నాందేడ్–నిజామాబాద్, నిజామాబాద్–హెచ్ఎస్ నాందేడ్, కాచిగూడ–కరీంనగర్, కరీంనగర్–కాచిగూడ, పూర్ణ–ఆదిలాబాద్, కాచిగూడ–నిజామాబాద్, నిజామాబాద్–కాచిగూడ, కాజీ పేట–సిర్పూర్‌టౌన్, బల్లార్ష–కాజీపేట, సిర్పూర్‌టౌన్–కరీంనగర్, కరీమ్‌నగర్–సిర్పూర్‌టౌన్, కరీంనగర్–నిజామాబాద్, నిజమాబాద్–కరీంనగర్‌ల మధ్య నడిచే రైళ్లు రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు

- ఐటీడీఏ ఏపీవో జనరల్ భీంరావ్


అర్జీలు స్వీకరిస్తున్న ఏపీవో జనరల్ భీంరావ్

ఉట్నూర్(ఖానాపూర్): తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ ఏపీవో జనరల్ భీంరావ్ అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులు 52 అర్జీలు అందజేశారు. తనకు గిరిజన వికాస పథకం ద్వారా తన పంటపొలంలో బోర్, విద్యుత్ సౌకర్యం కల్పించాలని తిర్యాణి మండలం పంగిడిమాదరకు చెందిన సోయం లచ్చు, డబుల్‌బెడ్రూం ఇళ్ల మంజూరు చేయాలని భీంపూర్ మండలం ఇంద్రనగర్‌కు చెందిన అత్రం మీరాబాయి, అటవీహక్కు చట్టం ద్వారా సంక్రమించిన భూమిని తన పేరు మీద విరాసత్ చేయాలని భీంపూర్ మండలం బీరునందికి చెందిన బానవత్ కమలాబాయి, తన కుటుంబ పోషణ నిమిత్తం స్వయం ఉపాధి కోసం ఐటీడీఏ ద్వారా రుణం మంజూరు చేయాలని గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన రమేశ్, తాను కుట్టు శిక్షణ పొంది ఉన్నానని, టైలర్‌షాప్ పెట్టుకునేందుకు ఐటీడీఏ ద్వారా రుణం మంజూరు చేయాలని ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన జాదవ్ శ్యామల విన్నవించింది. కార్యక్రమంలో ఏజెన్సీ అదనపు వైద్యాధికారి బాలు, పీవీటీజీ అధికారి భాస్కర్, డీపీవో ప్రవీణ్, ఓఎస్‌డీ కిష్టయ్య, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

స్నానానికీ నీళ్లు లేవు

- మున్సిపల్ కార్యాలయం ఎదుట మహిళల ఆందోళన


బైఠాయించిన మహిళలు, ఫోన్‌లో వైస్‌చైర్మన్‌తో మాట్లాడుతున్న కౌన్సిలర్ చందూలాల్

భైంసాటౌన్: 'సావుకు పోయి ఇంటికి వచ్చి స్నానం చేద్దామన్నా నీళ్లు ఉండడం లేదు. మా కాలనీలో నీటి ఇబ్బందులు తీర్చండి' అంటూ పట్టణంలోని ఏపీనగర్ కాలనీ మహిళలు మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేశారు. అధి కారుల దృష్టికి సమస్య తీసుకెళ్లేందుకు వెళ్తే కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో కొద్దిసేపు అక్క డే బైఠాయించారు. మిషన్ భగీరథ కింద ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చినా నీటి సరఫరా చేయడం లేదని తెలిపారు. బోరుమోటార్లు చెడిపోవడంతో వారం రోజులుగా నీటికి ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నాలుగో వార్డు కౌన్సిలర్ చందూలాల్ అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. అయినా వారు వినకపోవడంతో ము న్సిపల్ వైస్‌చైర్మన్ ఎండీ.జబీర్‌అహ్మద్‌కు ఫోన్‌లో సమస్య వివరించారు. మోటార్లకు మరమ్మతు చేయిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కన్నతల్లిని వదిలేశారు


బాసరలో వదిలివెళ్లిన వృద్ధురాలు

భైంసా: నవమాసాలు మోసి.. పేగు తెంచుకుని పుట్టిన బిడ్డలను పెంచి పెద్దచేసిన తల్లిని జీవిత చరమాంకంలో పిల్లలు ఒంటరిగా వదిలేశారు. ఈ ఘటన నిర్మల్ జిల్లా బాసరలో సోమవారం వెలుగు చూసింది. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం రెంజల్ గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు వారం రోజులుగా బాసర జ్ఞాన సరస్వతీ దేవస్థానం సమీపంలో వ్యాసమందిర్ మెట్ల వద్ద రోదిస్తూ కనిపిస్తోంది. దీంతో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు గమనించి వివరాలు తెలుసుకుని సోషల్‌మీడియాలో ఆమె గురించి పోస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఆలయ అధికారులు ఆమెను చేరదీశారు. నీరసంతో మాట్లాడలేని స్థితిలో ఉన్న వృద్ధురాలికి భోజనం ఏర్పాటు చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై మహేశ్ చేరుకుని వృద్ధురాలితో మాట్లాడారు. వివరాలు సేకరించారు. వృద్ధురాలు తనది నవీపేట్ మండలం రేంజల్ గ్రామమని తెలిపింది. దీంతో ఎస్సై నవీపేట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని ఎస్సై తెలిపారు.

అడవిపంది దాడిలో ఒకరికి గాయాలు

చింతలమానెపల్లి: మండల కేంద్రానికి చెందిన జోడె సావిత్రి బాయిపై సోమవారం అడవి పంది దాడి చేయడంతో గాయాలయ్యాయి. జోడె సావిత్రి బాయి చింతలమానెపల్లి శివారులోని పంట చేనులో పత్తి ఏరడానికి కూలి పనికి వెళ్ళింది. పత్తి ఏరుతుండగా అకస్మాత్తుగా అడవి పంది దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైంది. గమనించిన తోటి కూలీలు కేకలు వేయడంతో అడవిపంది పారిపోయింది.

'ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి'

కైలాస్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి తక్షణమే పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ అరెల్లి మల్లేశ్ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా సోమవారం ఆ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన హైదరాబాద్–విజయవాడ రహదారి దిగ్బంధంలో ఆయనతో పాటు నాయకులు బరుకుంటి సుభాష్, అడ్డిగ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఎకనామిక్స్) డాక్టర్ అతీక్ బేగం రచించిన 'ఇంటర్ రీజినల్ డిస్ పారిటీస్ ఇన్ తెలంగాణ' అనే పుస్తకాన్ని ఈ నెల 11న హైదరాబాద్‌లో తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్ 7వ సదస్సులో విడుదల చేశారు. ఆర్బీఐ మాజీ ప్రొఫెసర్ ఎస్. ఇంద్రకాంత్ పర్యవేక్షణలో అతీక్ భేగం ఈ పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకంలో తెలంగాణలో జిల్లాల మధ్య ఉన్న అసమానతల వివరణ, అన్ని జిల్లాల సమతౌల్య అభివృద్ధి కోసం నిర్ణయాల అమలు గురించి వివరించారు.


పుస్తకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

పోచమ్మకు సదర్ బోనాలు







ముత్యాల పోచమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా చండీ ఉపాసకులు పాలెం మనోహర్‌శర్మ, అర్చకులు శరత్‌చంద్ర బృందం ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారి మూల విగ్రహానికి విశేష క్షీరాభిషేకం, పుష్పాలంకరణ, మూల మంత్రసహిత చండీ యాగం, దిక్పాలక ప్రాకార బలి, మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం పోచమ్మ, దేశపతిరాజుల శాంతి కల్యాణం, మహాపట్నం, నాగవెల్లి నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన మహిళలు పెద్ద ఎత్తున సదర్‌బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండాడి నాగేందర్‌రావు, ఆలయ ధర్మకర్త కలవ్వకుంట్ల నారాయణరావు, కౌన్సిలర్ కావలి సంతోశ్, నాయకులు రంజిత్‌రావు, రమేశ్, రాజేశ్వర్, గంగనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు. – ఖానాపూర్